# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-02-2026　　　　సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అమరావతిలో "క్వాంటమ్ వ్యాలీ" భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.
- ❖ వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ రూపకల్పన జరిగిందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ అనకాపల్లి జిల్లాలో ఉక్కు పరిశ్రమకు మార్చ్ నెల మొదటి వారంలో శంకుస్థాపన చేస్తామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ వెల్లడించారు.
- ❖ పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ ఈరోజు అట్టహాసంగా ప్రారంభమైంది.

========================

అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ వ్యాలీ ప్రపంచ క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా మారుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో "క్వాంటమ్ వ్యాలీ" భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రానున్న నలభై ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్వాంటమ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దీని ద్వారా దేశంలో క్వాంటమ్ సాంకేతికతకు నాయకత్వం వహించే అవకాశం రాష్ట్రానికి దక్కిందని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను కేంద్రం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిపుచ్చుకుంటోందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, పి.నారాయణ, కందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

========================

అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఉక్కు పరిశ్రమకు మార్చ్ నెల మొదటి వారంలో శంకుస్థాపన నిర్వహిస్తామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. తిరుపతిలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. ఆర్ ఎస్ ఎల్ మిట్టల్ గ్రూపు ద్వారా లక్షా 35 వేల కోట్ల రూపాయలతో 17.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి ఉత్పత్తి సామర్థ్యంతో అనకాపల్లిలో పరిశ్రమ ఏర్పాటు కానుందని చెప్పారు. 2029 సంవత్సరానికి 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తితో మొదటి విడత, 2034 సంవత్సరానికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తితో రెండవ దశ పనులు పూర్తి చేస్తామన్నారు. అనకాపల్లిలో ఏర్పాటవుతున్న ఉక్కు పరిశ్రమ ద్వారా లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే శ్రీకాకుళం జిల్లాలో 2 మిలియన్ టన్నుల ఉత్పత్తితో మరో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

========================

గిరిజన, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం మక్కువ ప్రధాన రహదారి నిర్మాణానికి మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదల ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ రహదారి నిర్మాణాన్ని సుమారు 2 కోట్ల 65 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నామని, అవసరమైతే మరో కోటి రూపాయల నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

========================

రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు జరిగింది. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో ఇంగ్లిష్ పరీక్షను మరుసటి రోజుకు వాయిదా వేస్తూ.. విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. మొదట ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఇంగ్లిష్ పరీక్ష మార్చి 20న జరగాల్సి ఉంది. దీనిని మార్చి 21కి మార్చారు.

విరామం

========================

వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పన జరిగిందని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు. రాజమహేంద్రవరంలో పాత్రికేయులతో ఆయన ఈ రోజు మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం కేంద్రప్రభుత్వం ఎన్నో సంస్కరణలు చేపట్టిందన్నారు.

(వాయిస్ 20 సెకన్లు)

========================

పోక్సో చట్టం-2012, సెక్షన్-39 ప్రకారం బాధితులకు కేసు విచారణకు ముందు, విచారణ సమయంలో కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సపోర్ట్ పర్సన్స్ ను నియమించనున్నట్లు రాష్ట్ర బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధిబాలల సంక్షేమ శాఖ సంచాలకులు ఎం. వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. లైంగిక వేధింపులకు గురైన బాలలకు న్యాయపరమైన

మానసిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మార్గ నిర్దేశాల మేరకు ఈ నియామకాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 28 మంది సపోర్ట్ పర్సన్స్‌ను నియమిస్తారని, ప్రతి జిల్లాకు ఒకరు చొప్పున ఈ నియామకాలు ఉంటాయన్నారు.

========================

డిజిటల్ విధానంలో రిజిస్ట్రేషన్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులతో  దృశ్య మాధ్యమ విధానం ద్వారా సమావేశాన్ని ఆమె ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డాక్యుమెంట్ రైటర్స్ దగ్గరకు కానీ, మధ్యవర్తుల దగ్గరకు వెళ్ళకుండా వారికి రిజిస్ట్రేషన్ సౌకర్యం స్లాట్ బుకింగ్ ద్వారా 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుందని ప్రజలకు వివరించాలన్నారు.

========================

పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా చూసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి కోరారు. ఉత్తీర్ణత సాధించాలన్న తపన  పట్టుదలతో చదవాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యార్థులతో కలెక్టర్ ముఖా ముఖి కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని చెప్పారు. ప్రతి సబ్జెక్టులో నూరు శాతం మార్కులు వచ్చేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు.

========================

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లభిస్తోన్న ఆర్థిక సహాయాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులు కావాలని విశాఖపట్టణం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ కోరారు. విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ధరఖాస్తు చేసుకున్న ఐదుగురు లబ్దిదారులకు మొత్తం 2 లక్షల 6 వేల 613 రూపాయల చెక్కులను పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆయన ఈరోజు అందజేశారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

========================

చిత్తూరు జిల్లా పరిధిలో పని చేస్తున్న అన్ని చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్లు తమ సంస్థలను జువెనైల్ జస్టిస్ చట్టం 2015 లోని సెక్షన్ 41 ప్రకారం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా ప్రొబెషన్ అధికారి జి.లక్ష్మీపతి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి పూర్తిగా లేదా పాక్షికంగా నిధులు అందుకునే సంస్థలు, అలాగే స్వతంత్రంగా నిర్వహించబడుతున్న సంస్థలు సహా అన్ని చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్లకు ఈ నిబంధన వర్తిస్తుందని పేర్కొన్నారు.

========================

గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా సంయుక్త కలెక్టర్ బి. స్మరణ రాజ్ సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ హాలులో సంయుక్త కలెక్టర్ ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సికిల్ సెల్ ఎనీమియా ఉన్న వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సూచించారు.

========================

పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ ఈరోజు అట్టహాసంగా ప్రారంభమైంది. భారత్, శ్రీలంక దేశాలు ఆతిథ్యం ఇస్తున్న ఈ ప్రపంచ కప్‌లో 20 జట్లు పోటీపడుతున్నాయి. ఈ ప్రపంచ కప్ తొలి మ్యాచ్ నెదర్లాండ్స్, పాకిస్థాన్ జట్ల మధ్య కొలంబో వేదికగా జరగ్గా... పాకిస్థాన్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అలాగే కోల్‌కతా లోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా వెస్టిండీస్, స్కాట్‌లాండ్ జట్ల మధ్య రెండవ మ్యాచ్ జరుగుతోంది. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్... స్కాట్లాండ్‌కు 183 పరుగుల లక్ష్యాన్ని నిర్ధేశించింది. ఇక భారత్ తమ మొదటి మ్యాచ్‌ను ముంబైలోని వాంఖెడే స్టేడియం వేదికగా అమెరికాతో మరి కాసేపట్లో ఆడనుంది. రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.

========================

========================